PRGI REGN NO: APTEL/26/A3695

నేటి మినిట్ టు మినిట్

తెలుగు దిన పత్రిక

NETI MINUTE TO MINUTE

TELUGU DAILY

సంపుటి: 01 సంచిక :148 ఎడిషన్ : అనంతపురము మరియు సత్యసాయి జిల్లా, తేది : శుక్రవారం -13 నవంబర్ 2026, పేజీలు -4 వెల 1/-

VOLUME:01 ISSUE:148 EDITION: ANANTHAPURAMU, SATHYA SAI DIST. DATE: FRIDAY 13 NOVEMBER 2026 PAGES: 04 RS:01/

పెట్టుబడుల వెలువతో ఏపీకి పారిశ్రామిక కళ!

- తొలి రోజే రూ.5.84 లక్షల కోట్ల పెట్టుబడులు..



- 88 ఒప్పందాలు.. 1.07 లక్షల మందికి ఉద్యోగావకాశాలు
- విశాఖ వేదికగా ప్రపంచ పారిశ్రామిక దిగ్గజాల సమాగమం



విశాఖపట్నం,నవంబర్ 12(నేటి మినిట్ టు మినిట్): ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆధ్వర్యంలో 31వ భాగస్వామ్య సదస్సు గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు హాజరయ్యారు. సదస్సు తొలిరోజే 88 అవగాహన ఒప్పందాల ద్వారా రూ. 5.84 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. వీటి ద్వారా సుమారు 1.07 లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయని వెల్లడించారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సదస్సును ప్రారంభించి మిగతా2లో...

ఆసియాన్ సదస్సుకు మోడీ పర్యటన

- నవంబర్ 16 నుంచి 18 వరకు ఫిలిప్పీన్స్‌లో పర్యటన.. 23వ భారత్-ఆసియాన్ సదస్సు, 21వ తూర్పు ఆసియా సమావేశంలో పాల్గొననున్న ప్రధాని



న్యూఢిల్లీ,నవంబర్ 12(నేటి మినిట్ టు మినిట్): ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ నెల 16 నుంచి 18 వరకు ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో పర్యటించనున్నారు. 23వ ఆసియాన్-భారత్ సదస్సు, 21వ తూర్పు ఆసియా సదస్సులో ఆయన పాల్గొననున్నారు. ఈ మేరకు విదేశాంగ శాఖ తూర్పు విభాగం మిగతా2లో...

పెట్టుబడిదారుల రక్షణకు ప్రత్యేక చట్టం

- త్వరలో అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో బిల్లు ప్రవేశపెడతాం: చంద్రబాబు



ఏపీలో 23 పట్టణ స్థానిక సంస్థలకు

ఎన్నికల నోటిఫికేషన్ జారీ

- 26న పోలింగ్.. 30న ఓట్ల లెక్కింపు
- మొదటి దశ పంచాయతీ ఎన్నికలకు నేడు నోటిఫికేషన్
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా



అమరావతి,12(నేటి మినిట్ టు మినిట్): ఆంధ్రప్రదేశ్‌లో మిగిలిన 23 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఆయా పట్టణ ప్రాంతాల్లో తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. ఈ నెల 26న పోలింగ్, 27న అవసరమైతే రీపోలింగ్, 30న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన చేపట్టనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వెల్లడించారు.ఎన్నికలు జరగనున్న వాటిలో శ్రీకాకుళం, కాకినాడ, రాజమహేంద్రవరం, మంగళగిరితాడేపల్లి కార్పొరేషన్లు ఉన్నాయి. అలాగే ఆమదాలవలస, రాజాం, పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం, మిగతా2లో...

టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణాలకు గడువు విధించిన సీఎం

- జూన్ 2లోగా పనులు పూర్తి చేయాలి.. డిసెంబర్ నాటికి ఉస్మానియా ఆస్పత్రి సిద్ధం కావాలి



2035 నాటికి సంతోషకర

రాష్ట్రంగా ఏపీ

యువతకు ఉద్యోగాలతోపాటు ఆరోగ్యం, ఆనందం, ఆత్మవిశ్వాసం కల్పించడమే లక్ష్యం: నారా లోకేష్

మహిళల ఆరోగ్యం, ఉపాధి, ఆర్థిక స్వావలంబనపై ఉపాసన కొణిదెలతో చర్చ



విశాఖపట్నం,12(నేటి మినిట్ టు మినిట్): 2035 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఆరోగ్యవంతమైన, సంపన్నమైన, సంతోషకరమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. యువతకు ఉద్యోగాలు కల్పించడంతో పాటు వారు ఆరోగ్యంగా, సంతోషంగా, ఆత్మవిశ్వాసంతో జీవించే పరిస్థితులు కల్పించడం ప్రభుత్వ బాధ్యతని పేర్కొన్నారు.విశాఖపట్నంలో జరుగుతున్న మిగతా2లో...

భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

- 21 మంది ఐపీఎస్ అధికారులకు స్థానచలనం.. హైదరాబాద్ సీపీగా మహేశ్ భగవత్ ● సజ్జనార్‌కు ఫైర్ అండ్ డిజాస్టర్ రెస్పాన్స్ బాధ్యతలు.. మహిళా భద్రత విభాగం డీజీపీగా సౌమ్య మిశ్రా



డీఎస్సీ నియామకాల్లో నకిలీ ఈడబ్ల్యూఎస్ ధ్రువపత్రాలు!

1,500 మంది అనర్హులకు ఉద్యోగాలంటూ పిటిషన్.. పోలీసులకు హైకోర్టు ఆదేశం



అమరావతి,నవంబర్ 12(నేటి మినిట్ టు మినిట్):డీఎస్సీ2025 నియామకాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్) కోటా కింద నకిలీ ధ్రువపత్రాలు సమర్పించి పలువురు ఉద్యోగాలు పొందారన్న ఆరోపణలపై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారానికి మిగతా2లో...

పెట్టుబడుల వెల్లువతో ఏపీకి పారిశ్రామిక కళ!

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి, సంక్షోభ పరిస్థితులు ఉన్నప్పటికీ భారత్‌లో పెట్టుబడులు, వాణిజ్యానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని పియూష్ గోయల్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ముందుకు సాగడం అభినందనీయమన్నారు. కృత్రిమ మేధ, క్వాంటమ్ ఇంజినీరింగ్, డేటా సెంటర్ల వంటి ఆధునిక రంగాల్లో రాష్ట్రానికి మంచి అవకాశాలున్నాయని తెలిపారు.ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు అనుకూలమైన రాష్ట్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ సదస్సు ద్వారా 25 రంగాల్లో 303 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుని, రూ.9.89 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. కేవలం ఒప్పందాలు చేసుకోవడమే కాకుండా వాటిని వాస్తవ పరిశ్రమలుగా మార్చి, యువతకు ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.2024 జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రానికి రూ.22.60 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన 714 ప్రాజెక్టులు వచ్చాయని చంద్రబాబు తెలిపారు. వీటిలో రూ.17.10 లక్షల కోట్ల విలువైన 526 ప్రాజెక్టులకు భూమి, ప్రోత్సాహకాలు తదితర అంశాలపై ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. మరో రూ.7.30 లక్షల కోట్ల విలువైన 303 ప్రాజెక్టుల నిర్మాణానికి రంగం సిద్ధమైందని వివరించారు. రాష్ట్రానికి వచ్చిన మొత్తం పెట్టుబడుల విలువ రూ.32.49 లక్షల కోట్లకు చేరినట్లు పేర్కొన్నారు.పరిశ్రమలు, ఇంధనం, ఎలక్ట్రానిక్స్, రక్షణ, అంతరిక్షం, కృత్రిమ మేధ, డేటా సెంటర్లు, పోర్టులు, విమానాశ్రయాలు, రైల్వేలు, సాగునీటి రంగాల్లో పెట్టుబడులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్రంలో 4.6 గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపామని, విశాఖను డేటా సెంటర్లకు ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. అమరావతిలో 250 ఎకరాల్లో క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీని ఏర్పాటు చేస్తున్నామని, 2027 ఫిబ్రవరి 3న ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సముద్ర తీరాన్ని ఆర్థికాభివృద్ధికి ప్రధాన వనరుగా మలుచుకునేలా పోర్టుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ అవకాశాల గని అని, రాష్ట్ర అభివృద్ధిలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని కోరారు. భారీ పరిశ్రమలతో పాటు చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించాలని, గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోనూ పెట్టుబడులు పెట్టాలని సూచించారు. పర్యావరణానికి హాని కలగకుండా పరిశ్రమలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. పారిశ్రామికవేత్తలకు వేగవంతమైన సేవలు అందించడంతో పాటు ప్రోత్సాహకాలను సకాలంలో చెల్లించేందుకు ఎస్క్రో ఖాతాల విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. పెట్టుబడిదారులకు భరోసా కల్పించేందుకు త్వరలో ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురానున్నట్లు వెల్లడించారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సహకారం అందిస్తూ రాష్ట్రాన్ని పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన కేంద్రంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ కీలక పాత్ర పోషించేందుకు సిద్ధమవుతోందన్నారు. దేశంలో విమానాశ్రయాల సంఖ్య 2014లో 74 ఉండగా ప్రస్తుతం 166కు చేరిందని తెలిపారు. సదస్సులో రాష్ట్ర మంత్రులు టి.జి. భరత్, బి.సి. జనార్దన్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, జీఎంఆర్ సంస్థ చైర్మన్ గ్రంథి మల్లికార్జునరావు, వివిధ సంస్థల ప్రతినిధులు, విదేశీ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

ఆసియాన్ సదస్సుకు మోడీ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

కార్యదర్శి రుద్రేంద్ర టాండన్ వివరాలు వెల్లడించారు.మూడు రోజుల పర్యటనలో భాగంగా ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ ఆతిథ్యమిచ్చే విందులో మోడీ పాల్గొంటారు. అనంతరం ఆసియాన్-భారత్ సదస్సు, తూర్పు ఆసియా సదస్సు సమావేశాలకు హాజరవుతారు. పర్యటన సందర్భంగా వివిధ దేశాల అధినేతలతో ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉంది. ఆసియాన్ కూటమిలో 11 దేశాలు సభ్యులుగా ఉన్నాయి.

ఈ ప్రాంతంతో భారత్‌కు ప్రస్తుతం సుమారు 122 బిలియన్ డాలర్ల వాణిజ్య సంబంధాలున్నాయి. ఆగ్నేయాసియా దేశాలతో వ్యూహాత్మ క భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడం, ప్రాంతీయ శాంతి, భద్రత, ఆర్థిక సహకారాన్ని పెంపొందించుకోవడంలో ఈ పర్యటన కీలకంగా మారనుంది. భారత్ అనుసరిస్తున్న 'యాక్ట్ ఈస్ట్' విధానంలో ఆసియాన్ దేశాలతో సంబంధాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని విదేశాంగ శాఖ వెల్లడించింది.

పెట్టుబడిదారుల రక్షణకు ప్రత్యేక చట్టం

విశాఖపట్నం,నవంబర్ 12(నేటి మినిట్ టు మినిట్): రాష్ట్రంలో పెట్టుబడిదారులకు భరోసా కల్పించేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురానున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభ కార్యక్రమంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. దీనికి సంబంధించిన ప్రాథమిక ప్రతిపాదన (కాన్సెప్ట్ నోట్) ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలిపారు.పెట్టుబడిదారుల అభిప్రాయాలు సేకరించిన అనంతరం త్వరలో జరగనున్న అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెడతామని చంద్రబాబు చెప్పారు. రాష్ట్ర శాసనసభ ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామని, దీనిని జాతీయ స్థాయి చట్టంగా రూపొందించి దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలని కేంద్ర మంత్రి పియూష్ గోయల్‌ను కోరారు.ప్రభుత్వాలు మారినప్పుడల్లా పరిశ్రమలకు కేటాయించిన భూములు, స్థలాలు, మంజూరు చేసిన రాయితీలు, అనుమతులను ఏకపక్షంగా మార్చుకుండా నిరోధించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని ముఖ్యమంత్రి వివరించారు. పెట్టుబడిదారులకు స్థిరమైన విధానాలు, భరోసా కల్పించడం ద్వారా రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు ఆకర్షించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణాలకు గడువు విధించిన సీఎం

హైదరాబాద్,నవంబర్ 12(నేటి మినిట్ టు మినిట్): రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేసే దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. మూడు టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణ పనులను వచ్చే ఏడాది జూన్ 2లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణాన్ని డిసెంబర్ నాటికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.గురువారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో వైద్యారోగ్య శాఖపై నిర్వహించిన సమీక్షలో సీఎం మాట్లాడుతూ.. టిమ్స్ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది నియామకాలకు ఒకే విధమైన విధానం అమలు చేయాలని సూచించారు. అవసరాన్ని బట్టి మూడు ఆస్పత్రుల మధ్య సిబ్బంది బదిలీలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సనత్‌నగర్ టిమ్స్‌లో వైద్యుల నియామకాలు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయంగా వైద్యులను నియమించాలని ఆదేశించారు.నిమ్స్‌లో పడకలు అందుబాటులో లేని పరిస్థితుల్లో రోగులను సనత్‌నగర్ టిమ్స్‌కు తరలించేలా రెండు ఆస్పత్రుల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. టిమ్స్, ప్రభుత్వ వైద్య కళాశాలలకు అవసరమైన అదనపు నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది హాజరును సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షించాలని, పారిశుధ్య నిర్వహణను పటిష్టంగా చేపట్టాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఈ సమీక్షలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏపీలో 23 పట్టణ స్థానిక సంస్థలకు

ఎన్నికల నోటిఫికేషన్ జారీ

(మొదటి పేజీ తరువాయి)

తణుకు, చింతలపూడి, గుడివాడ, తాడిగడప, పొన్నూరు, నరసరావుపేట, బాపట్ల, కందుకూరు, పొదిలి, కావలి, గూడూరు, అల్లూరు, శ్రీకాళహస్తి, బి.కొత్తకోట మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు.ఈ నెల 14న ఎన్నికల అధికారులు నోటీసులు జారీ చేయనుండగా, 16వ తేదీ నామినేషన్ల దాఖలుకు చివరి గడువుగా నిర్ణయించారు. 17న నామినేషన్ల పరిశీలన, 19న ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన అనంతరం తుది అభ్యర్థుల జాబితా ప్రకటించనున్నారు. మేయర్లు, చైర్‌పర్సన్ల ఎంపికకు డిసెంబర్ 5, 6 తేదీల్లో పరోక్ష ఎన్నికలు నిర్వహించనున్నారు.ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎన్నికల కమిషనర్ ఆదేశించారు. నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో సీసీ కెమెరాలు, వీడియో రికార్డింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు స్పష్టం చేశారు.

2035 నాటికి సంతోషకర రాష్ట్రంగా ఏపీ

(మొదటి పేజీ తరువాయి)

సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా 'యంగ్ ఆంధ్ర.. థ్రైవింగ్ ఆంధ్ర' పేరుతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో లోకేష్ పాల్గొన్నారు. అపోలో హాస్పిటల్స్ వైస్ చైర్మన్, యూఆర్ లైఫ్ వ్యవస్థాపకురాలు ఉపాసన కొణిదెల ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. విద్య, ఉపాధి, మహిళా సాధికారత, కుటుంబ విలువలు, ఆరోగ్యం, సాంకేతికత, పారిశ్రామికాభివృద్ధి తదితర అంశాలపై ఆమె అడిగిన ప్రశ్నలకు లోకేష్ సమాధానాలిచ్చారు. రాష్ట్రం గతంలో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొన్నప్పటికీ తిరిగి అభివృద్ధి పథంలో పయనిస్తోందని లోకేష్ చెప్పారు. ఆరోగ్య సమస్యలు వచ్చిన తర్వాత వైద్యులను సంప్రదించడం కంటే ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడంపై యువతలో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి నియంత్రించుకోవాలని సూచించారు.ప్రపంచవ్యాప్తంగా సుమారు 58 లక్షల మంది నర్సుల అవసరం ఉందని ఉపాసన పేర్కొనగా, వైద్యారోగ్య రంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేలా యువతకు శిక్షణ కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని లోకేష్ తెలిపారు. మహిళల్లో రక్తహీనత, ప్రసవానంతర సంరక్షణ, పిల్లల పెంపకం కారణంగా ఉద్యోగాలు వదిలేస్తున్న మహిళలను తిరిగి ఉపాధిలోకి తీసుకురావడం వంటి అంశాలపైనా చర్చించారు. పరిశ్రమలు, కార్యాలయాల్లో పిల్లల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తే మహిళలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు.కుటుంబానికి సమయం కేటాయించడం తనకు అన్నింటికంటే కష్టమని లోకేష్ సరదాగా వ్యాఖ్యానించారు. వీలైనప్పుడల్లా కుటుంబంతో గడిపేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు.

డీఎస్సీ నియామకాల్లో నకిలీ ఈడబ్ల్యూఎస్ ధ్రువపత్రాలు!

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాలని పోలీసులను ఆదేశించింది. ఈడబ్ల్యూఎస్ కోటాలో సుమారు 1,500 మంది అనర్హ అభ్యర్థులు నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఆరోపిస్తూ కర్నూలు, నంద్యాల, కడప జిల్లాలకు చెందిన పలువురు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని పిటిషన్‌లో కోరారు.కర్నూలుకు చెందిన ప్రతాపరెడ్డి మరో ఎనిమిది మందితో కలిసి ఈ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ల తరపున న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు. విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేశారు.

భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

21 మంది ఐపీఎస్ అధికారులకు స్థానచలనం..
హైదరాబాద్ సీపీగా మహేశ్ భగవత్
సజ్జనార్‌కు ఫైర్ అండ్ డిజాస్టర్ రెస్పాన్స్ బాధ్యతలు..
మహిళా భద్రత విభాగం డీజీపీగా సౌమ్య మిశ్రా



హైదరాబాద్,నవంబర్ 12(నేటి మినిట్ టు మినిట్): తెలంగాణ రాష్ట్రంలో పోలీస్ శాఖలో ప్రభుత్వం భారీ మార్పులు చేపట్టింది. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 21 మంది ఐపీఎస్ అధికారులకు స్థానచలనం కల్పిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కీలకమైన హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా మహేశ్ మురళీధర్ భగవత్‌ను నియమించింది. ఇప్పటివరకు సీపీగా పనిచేసిన వీసీ సజ్జనార్‌ను తెలంగాణ అగ్నిమాపక, విపత్తుల స్పందన, అత్యవసర సేవలు, పౌర రక్షణ విభాగం డీజీగా బదిలీ చేసింది. ఆయనకు ప్రత్యేక రక్షణ దళం (ఎస్పీఎఫ్) డీజీగా అదనపు బాధ్యతలు కూడా అప్పగించింది.జైళ్లు, దిద్దుబాటు సేవల డీజీపీగా ఉన్న డాక్టర్ సౌమ్య మిశ్రాను మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా విభాగాల డీజీపీగా నియమించింది. పోలీస్ ఆర్గనైజేషన్, లీగల్ విభాగాల అదనపు బాధ్యతలు కూడా ఆమెకు కేటాయించింది. స్వాతి లక్రాకు జైళ్ల శాఖ డీజీపీ బాధ్యతలు అప్పగించడంతోపాటు హోంగార్డ్స్ విభాగం అదనపు బాధ్యతలు ఇచ్చింది. చారు సిన్హాను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీజీపీగా నియమిస్తూ, సీఐడీ బాధ్యతలను అదనంగా కొనసాగించింది.రవాణా రంగంలోనూ కీలక మార్పులు చేసింది. డాక్టర్ అనిల్‌కుమార్‌ను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించింది. ఇప్పటివరకు ఆర్టీసీ ఎండీగా ఉన్న వై. నాగిరెడ్డిని పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా బదిలీ చేసింది. విక్రమ్ సింగ్ మాన్‌కు గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల ఆపరేషన్స్ డీజీపీ బాధ్యతలు అప్పగించింది. అకున్ సబర్వాల్‌ను శాంతిభద్రతల అదనపు డీజీపీగా నియమించింది. ఎం. స్టీఫెన్ రవీంద్రకు తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో డైరెక్టర్ బాధ్యతలు కేటాయించింది.ఇక కార్తికేయను మల్టీజోన్-1 ఐజీగా, కే. రమేష్ నాయుడును రైల్వేస్ ఐజీగా, నారాయణ నాయక్‌ను మల్టీజోన్-2 డీఐజీగా నియమించింది. జి. చందన దీప్తికి జోన్-7 (జోగులాంబ) డీఐజీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఎస్. చంద్రశేఖర్‌రెడ్డిని ఏసీబీ డైరెక్టర్‌గా నియమించింది. పోలీస్ శాఖతోపాటు నిఘా, రైల్వేలు, ట్రాఫిక్, శిక్షణ, పౌరసరఫరాల వంటి కీలక విభాగాల్లో ఈ మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జారీ చేసిన జీవో నంబర్ 1654 ద్వారా ఈ బదిలీలు అమల్లోకి వచ్చాయి.

మురసు తుపాను నష్టాలపై కేంద్ర బృందం పరిశీలన


- నేడు బాపట్ల, ఏలూరులో పర్యటన.. రేపు పల్నాడు, తూర్పుగోదావరిలో పర్యటన



అమరావతి,నవంబర్ 12(నేటి మినిట్ టు మినిట్): మురసు తుపాను కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు ఏడుగురు సభ్యులతో కూడిన కేంద్ర బృందం శుక్ర, శనివారాల్లో ప్రభావిత జిల్లాల్లో పర్యటించనుంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ చిత్తరంజన్ దాస్ నేతృత్వంలో ఈ బృందం పర్యటన సాగనుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు.కేంద్ర బృందం రెండు గ్రూపులుగా విడిపోయి శుక్రవారం బాపట్ల, ఏలూరు జిల్లాల్లో పర్యటించనుంది. శనివారం మొదటి బృందం పల్నాడు జిల్లాలో, రెండో బృందం తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించి తుపాను వల్ల జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించనుంది. బాధితులతో మాట్లాడి నష్టానికి సంబంధించిన వివరాలను సేకరించనుంది.వ్యవసాయం, జలవనరులు, ఆర్థికం, రహదారులు, గ్రామీణాభివృద్ధి, విద్యుత్ శాఖలకు చెందిన అధికారులు, ఇస్రో శాస్త్రవేత్త ఈ బృందంలో ఉన్నారు. అర్నబ్ తుపాను నష్టాన్ని అంచనా వేసేందుకు గతంలో నియమించిన బృందాన్నే మురసు తుపాను నష్టాల పరిశీలనకు కేంద్రం పంపించింది. పర్యటన అనంతరం ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కేంద్ర బృందం సమావేశమై తమ పరిశీలన వివరాలను వెల్లడించే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు.

“ పొద్దున గెలుపు... మధ్యాహ్నం పిలుపు... సాయంత్రం అలుపు... అర్ధరాత్రి మలుపు... ఏపీ రాజకీయాల్లో కలకలం...? “

● ప్రజల తీర్పుకు నాయకుల బ్రేక్... ఫోన్ కాల్‌తో మారిన గెలుపు లెక్క ● ఓడిపోయినోళ్లకు మళ్లీ గెలుపు... గెలిచినోళ్లకు అధికారుల షాక్ ● జేఎన్టీయూలో ఎన్నికల హైడ్రామా... ప్రజాస్వామ్యానికి కొత్త నిర్వచనమా? ● ఓటర్లు ఓటేశారు... అధికారులు ఆటాడారా? ● డిక్లరేషన్ ఇవ్వడానికి అంత భయమా...? గెలుపును ప్రకటించడానికి ఇంత ఆలస్యమా? ● ప్రజల ఓటుకు విలువ లేదా...? నాయకుల ఫోన్‌కే పవర్ ఉందా? ● సలకం చెరువులో గెలుపు ఎవరిది...? ఓటమి ఎవరిది...? అసలు నాటకం నడిపిందెవరు? ● కౌంటింగ్ కేంద్రంలో ప్రజాస్వామ్యానికి చుక్కెదురు... అర్ధరాత్రి రాజకీయాలకు తెరతీశారా? ● ఎన్నికల సంఘమా...? లేక నాయకుల ఆదేశాల సంఘమా? ● ఓటమిని ఒప్పుకోని నాయకత్వం... గెలుపును ప్రకటించని యంత్రాంగం ● మూడు గ్రామాల ఓట్లు... మూడు గంటల హైడ్రామా... రాష్ట్రవ్యాప్తంగా చర్చ



శింగనమల, నవంబర్ 12(నేటి మినిట్ టు మినిట్): స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్‌లో సాధారణంగా ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. విజేత ఎవరో ప్రకటిస్తారు. ఓడిన అభ్యర్థులు ఫలితాన్ని అంగీకరిస్తారు. కానీ సింగనమల నియోజకవర్గంలోని సలకం చెరువు ఎంపీటీసీ ఎన్నికల వ్యవహారం మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా సాగిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయం మొదలైన గెలుపు కథ మధ్యాహ్నానికి పిలుపుగా మారి, సాయంత్రానికి ఉత్కంఠను పెంచి, అర్ధరాత్రికి మరో మలుపు తిరిగిందంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు.

గెలిచిన అభ్యర్థికి డిక్లరేషన్ ఇవ్వడంలో జాప్యం ఎందుకు?

సలకం చెరువు ఎంపీటీసీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ఉల్లిగల్లు రంగారెడ్డి భార్య గెలుపొందినట్లు తొలుత ప్రకటించారని, అధికారులు సైతం సంతకాలు చేసినప్పటికీ డిక్లరేషన్ ఫామ్ అందించకుండా జాప్యం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదయం వచ్చిన ఫలితం సాయంత్రం వరకు అధికారికంగా ఎందుకు ఖరారు కాలేదన్న ప్రశ్న ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

ఒక్క ఫోన్ కాల్‌తో మారిపోయిన గెలుపు లెక్కలా?

తొలుత విజయం సాధించినట్లు భావించిన స్వతంత్ర అభ్యర్థి స్థానంలో, చివరకు టీడీపీ అభ్యర్థిని విజేతగా ప్రకటించారనే ఆరోపణలు రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత మళ్లీ కౌంటింగ్ నిర్వహించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? మొదట ప్రకటించిన ఫలితానికి, చివరికి వెల్లడించిన ఫలితానికి మధ్య అసలు తేడా ఏమిటి? ఎవరి ఆదేశాలతో ఈ మార్పులు జరిగాయి? అన్న ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

అర్ధరాత్రి వరకు హైడ్రామా... తెల్లవారుజామున ఫలితం

రాత్రి ఒంటి గంట నుంచి తెల్లవారుజామున నాలుగు గంటల వరకు పోలీసుల సమక్షంలో కౌంటింగ్ ప్రక్రియ కొనసాగిందని స్థానికులు చెబుతున్నారు. చివరకు తెల్లవారుజామున సుమారు మూడు గంటల సమయంలో టీడీపీ అభ్యర్థి గెలిచినట్లు ప్రకటించారనే ప్రచారం సాగుతోంది. మొదట వచ్చిన ఫలితం ఏమైంది? తిరిగి కౌంటింగ్ ఎందుకు నిర్వహించారు? ఓట్ల లెక్కింపులో ఏమైనా పొరపాట్లు జరిగాయా? అనే అంశాలపై ఎన్నికల అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

ప్రజల తీర్పా...? నాయకుల నిర్ణయమా?

ప్రజలు తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసి గెలిపించుకుంటే, ఆ గెలుపును చివరకు ఎవరు నిర్ణయిస్తారు? ఓటర్లా? ఎన్నికల అధికారులా? లేక రాజకీయ నాయకులా? అన్న ప్రశ్నలు సలకం చెరువు ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతున్నాయి. ఓటు వేసిన ప్రజలకు తమ తీర్పుపై నమ్మకం లేకుండా చేసే పరిస్థితులు ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచివి కావని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



గెలిచిన ఇండిపెండెంట్ అభ్యర్థి చుట్టూ రాజకీయ నాయకులు గుమిగూడిన దృశ్యాలు, ఓ పార్టీ అధ్యక్షుడుతో ఫోన్‌లో సంభాషణలు

ఎమ్మెల్యేపై వ్యతిరేకత ఉందా...? స్వతంత్ర అభ్యర్థి గెలుపే సంకేతమా?

సింగనమల నియోజకవర్గంలో అధికార పార్టీకి ఎదురవుతున్న రాజకీయ పరిస్థితులు కూడా ఈ వివాదంతో మరోసారి చర్చకు వచ్చాయి. పలు స్థానాల్లో ఎదురైన ఓటముల మధ్య సలకం చెరువులో స్వతంత్ర అభ్యర్థి గెలుపు స్థానిక రాజకీయ సమీకరణాలను ప్రతిబింబించిందని కొందరు విశ్లేషిస్తున్నారు. అయితే ఆ గెలుపు విషయంలో చోటుచేసుకున్న పరిణామాలపై మాత్రం అధికారిక వివరణ రావాల్సి ఉంది.

మూడు గ్రామాల ప్రజల ఆగ్రహం... భారీ ధర్నాకు సిద్ధమా?

సలకం చెరువు ఎన్నికల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని, తొలుత వెల్లడించిన ఫలితాలు, తుది కౌంటింగ్ వివరాలు, డిక్లరేషన్ ప్రక్రియపై పూర్తి వివరాలు బయటపెట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించకపోతే మూడు మండలాల ప్రజలను ఏకం చేసి భారీ ధర్నా నిర్వహిస్తామని హెచ్చరిస్తున్నట్లు సమాచారం.

ఎన్నికల సంఘం స్పందించాలి... ఉన్నతాధికారులు విచారణ చేయాలి

ఈ వ్యవహారంలో కలెక్టర్‌తో పాటు జిల్లా ఎన్నికల అధికారులు జోక్యం చేసుకుని కౌంటింగ్ కేంద్రంలోని సీసీటీవీ దృశ్యాలు, ఓట్ల లెక్కింపు రికార్డులు, రౌండ్ల వారీ ఫలితాలు, రిటర్నింగ్ అధికారి నమోదు చేసిన పత్రాలను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మా ఓటు వేస్తేనా...? మీరే ఓటేసుకుని మీరే గెలవండి

ప్రజాస్వామ్యంలో ఓటు అనేది సామాన్యుడి చేతిలో ఉన్న అత్యంత శక్తివంతమైన ఆయుధం.

అలాంటి ఓటుతో ఇచ్చిన తీర్పుపై అనుమానాలు తలెత్తే పరిస్థితి వస్తే ప్రజలకు ఎన్నికల వ్యవస్థపై నమ్మకం ఎలా ఉంటుంది? గెలిచినవారిని ఓడిపోయినట్లుగా, ఓడిపోయినవారిని గెలిచినట్లుగా ప్రకటించారనే ఆరోపణలు నిజమా కాదా అన్నది విచారణలో తేలాలి. కానీ ప్రజల్లో మాత్రం ఒకటే ప్రశ్న వినిపిస్తోంది...

మా ఓటుతో మాకు నచ్చిన నాయకుడిని గెలిపించుకోలేకపోతే, ఇక మేమెందుకు ఓటు వేయాలి? మీరే ఓటేసుకోండి... మీరే గెలుచుకోండి.



కియాతో ఏపీ ప్రభుత్వం కీలక ఒప్పందం..

రాష్ట్రానికి భారీ పెట్టుబడులు

సత్యసాయి జిల్లా,నవంబర్ 12(నేటి మినిట్ టు మినిట్):
ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో మరో కీలక ముందడుగు పడింది. సత్యసాయి జిల్లాలో కియా సంస్థ తన ప్లాంట్ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వంతో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ విస్తరణలో భాగంగా సుమారు రూ.18 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సంస్థ అంగీకరించింది. 465 ఎకరాల విస్తీర్ణంలో రెండో ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు.
2030 నాటికి నూతన ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభించేలా కియా సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసింది. అయితే ప్లాంట్ నిర్మాణ పనులను 2029 నాటికే పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సంస్థ ప్రతినిధులను కోరారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.కియా సంస్థ విస్తరణతో రాష్ట్రంలో పెట్టుబడులు పెరగడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. అనుబంధ పరిశ్రమలు, రవాణా, సేవా రంగాలకు కూడా ప్రయోజనం చేకూరనుంది. మొత్తంగా ఈ ఒప్పందం ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతికి మరింత ఊతమివ్వనుంది.

జాతీయ క్రీడల్లో అనంతపురం చిన్నారి సత్తా.. రెండు పతకాలు కైవసం

200 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణం, లాంగ్‌జంప్‌లో రజతం.. మెరిట్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో మరో చిన్నారికి చోటు

అనంతపురం, నవంబర్ 12(నేటి మినిట్ టు మినిట్):
హర్యానాలోని రోహ్‌తక్‌లో నిర్వహించిన ఒలింపిక్ నేషనల్ గేమ్స్ 202627లో అనంతపురానికి చెందిన చిన్నారి అద్భుత ప్రతిభ కనబరిచాడు. అనంతపురం ఫోర్ట్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పి. హిమావంత్‌రెడ్డి కుమారుడు జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రెండు పతకాలు సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచాడు. 200 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, లాంగ్‌జంప్‌లో రజత పతకం కైవసం చేసుకున్నాడు.అదేవిధంగా హిమావంత్‌రెడ్డి కుమార్తె బానుజ కూడా తన ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు పొందింది. తిరుపతిలో నిర్వహించిన ‘నాట్యనీరాజనం2’ కార్యక్రమంలో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుని ‘మెరిట్ బుక్ ఆఫ్ రికార్డ్స్’లో స్థానం సంపాదించింది. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులు వేర్వేరు రంగాల్లో ప్రతిభ చాటడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా చిన్నారులు తమ తల్లిదండ్రులతో కలిసి జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వారి విజయాలను తెలుసుకున్న ఎస్పీ చిన్నారులను అభినందించి పతకాలు అందజేశారు. క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో ఇదే ఉత్సాహంతో ముందుకు సాగి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్న హిమావంత్‌రెడ్డి కుటుంబాన్ని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. చిన్న వయసులోనే జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం, రికార్డుల్లో చోటు సంపాదించడం అభినందనీయమని పేర్కొన్నారు. చిన్నారుల విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు.



జలాశయాల నీటిని తాగునీటి అవసరాలకే వినియోగించాలి

● పెండింగ్ ఎన్నికల ఫారాల ప్రక్రియ నవంబర్ 20లోగా పూర్తి చేయాలి

● 22ఏ భూముల దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



కర్నూలు నవంబర్ 12(నేటి మినిట్ టు మినిట్): గాజులదిన్నె ప్రాజెక్టు, సుంకేసుల జలాశయాల్లోని నీటిని కేవలం తాగునీటి అవసరాలకే వినియోగించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. సాగునీటి అవసరాలకు నీటిని వినియోగించకూడదని స్పష్టం చేశారు. గురువారం రెవెన్యూ అంశాలపై అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పలు అంశాలను సమీక్షించారు.జలాశయాల నీటి వినియోగంపై గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫారాల పరిశీలన, పంపిణీ ప్రక్రియను నవంబర్ 20లోగా పూర్తి చేయాలని ఆదేశించారు.బియ్యం పంపిణీపై వస్తున్న వార్తల నేపథ్యంలో రైస్ కౌంటర్లను తనిఖీ చేసి వారంలోగా నివేదికలు సమర్పించాలని అధికారులకు సూచించారు. 22ఏ భూములకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 290 దరఖాస్తులను నవంబర్ 16లోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు.రీసర్వే మూడో, నాలుగో దశల్లో పెండింగ్ పనులను పూర్తి చేయాలని, ఆరో దశలోని 44 గ్రామాల్లో రోజువారీ సర్వేల సంఖ్యను 4,000కు పెంచాలని ఆదేశించారు. ఇళ్ల స్థలాలకు సంబంధించి అర్హులు, లబ్ధిదారులు, అవసరమైన భూమి, అంచనా వ్యయంతో నివేదిక సిద్ధం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీఓ ఓబులేసు, ఆదోని ఆర్డీఓ అరుణదేవి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పసుపుల రాజశేఖర్‌కు వైవీయూ డాక్టరేట్ ప్రదానం

- మహిళా కార్యకర్తల స్వీయ జీవిత చరిత్రలపై పరిశోధన



కడప, నవంబర్ 12(నేటి మినిట్ టు మినిట్): యోగి వేమన విశ్వవిద్యాలయం ఆంగ్ల శాఖ పరిశోధక విద్యార్థి పసుపుల రాజశేఖర్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు.ఆంగ్ల శాఖ ఆచార్యులు పి. పద్మ పర్యవేక్షణలో 'ఎంపిక చేసిన భారతీయ మహిళా కార్యకర్తల స్వీయ జీవిత చరిత్రలు: ఒక అధ్యయనం' అనే అంశంపై రాజశేఖర్ పరిశోధన చేశారు. పరిశోధనా గ్రంథాన్ని నిపుణుల బృందం మూల్యాంకనం చేసి, వైవా వోస్ కమిటీ సిఫార్సుల మేరకు పార్ట్‌టైమ్ పీహెచ్‌డీ డిగ్రీకి అర్హుడిగా ప్రకటించారు.డాక్టరేట్ పొందిన రాజశేఖర్‌ను వైవీయూ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి. శ్రీనివాస్, రెక్టార్ ప్రొఫెసర్ ఏజీ దాము, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్సీ గంగిరెడ్డి, ఆంగ్ల శాఖ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

పశుగ్రాసం కొరత నివారణకు సీఎం చంద్రబాబు తక్షణ చర్యలు

- రూ.కోటి విలువైన 250 టన్నుల మేత సరఫరాకు ఆదేశాలు

అమరావతి నవంబర్ 12(నేటి మినిట్ టు మినిట్): ఎల్‌నినో ప్రభావంతో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో నెలకొన్న పశుగ్రాసం కొరతపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తక్షణమే స్పందించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ విజ్ఞప్తి మేరకు అధికారులతో సమీక్షించి, కొరత ఉన్న ప్రాంతాలకు వెంటనే మేత సరఫరా చేయాలని ఆదేశించారు.రెండు జిల్లాల్లో కలిపి సుమారు 11.04 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం కొరత ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో భాగంగా రూ.కోటి విలువైన 250 మెట్రిక్ టన్నుల పశుగ్రాసాన్ని తక్షణమే సరఫరా చేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ అమరేంద్ర తెలిపారు.నవంబర్ 10న జరిగిన కేబినెట్ సమావేశంలో మంత్రి సత్యకుమార్ ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పశుసంపదను కాపాడటంతో పాటు రైతులు, పశుపోషకుల జీవనోపాధికి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కొరత ఉన్న ప్రాంతాలకు ప్రాధాన్యమిస్తూ ఎండుగడ్డి, పచ్చిగడ్డి, పశుదాణా సరఫరా చేస్తామని మంత్రి తెలిపారు. పశుపోషకులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.

నేడు తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఎన్నికల సన్నాహక సమావేశం

- గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్.వి. మహేందర్ పటేల్



హైదరాబాద్, నవంబర్ 12(నేటి మినిట్ టు మినిట్): తెలంగాణ మున్నూరు కాపు సంఘం (పటేల్స్) ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్.వి. మహేందర్ పటేల్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఉదయం 10:30 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ మున్నూరు కాపు సంఘం (పటేల్స్) వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మున్నూరుకాపు కుల బాంధవులు, సంఘం నాయకులు, కార్యకర్తలు, మిత్రులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని మహేందర్ పటేల్ విజ్ఞప్తి చేశారు.

నామినేషన్ వేస్తే.... నాలుగు లక్షలా...?

● ఆర్టీఐ అస్త్రం.. వసూళ్లే లక్ష్యమా..? ● సంఘం పేరు సెంటిమెంట్.. వసూళ్లే అసలు ఎంటర్‌టైన్‌మెంట్ ● నామినేషన్ టికెట్‌తో నాలుగు లక్షల గ్యారెంటీనా..? ● కులం పేరు చెప్పి కలెక్షన్లా..? ● అధికారులకు హెచ్చరికలు.. ప్రజలకు ప్రశ్నలు.. ఇదేం నాయకత్వం ● సంఘం సేవకుడా..? ఆరోపణల సేకరణకర్తా..? ● కులం పేరు.. సంఘం అండ.. ఇదేనా వసూళ్ల దందా? ● గతంలోను కలెక్టర్ సంతకం ఫోర్జరీ ● అధికారులనే టార్గెట్ చేస్తున్నారా..? సంఘం నేతపై స్థానికుల సంచలన ప్రెస్‌మీట్ ● వసూళ్ల ఆరోపణలపై అధికారులు స్పందించాలి.. లేదంటే ఉద్యమం తప్పదంటున్న నాయకులు, స్థానికులు. ● కులం, సంఘం పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారంటూ ప్రెస్‌మీట్.. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పామిడి వాసుల డిమాండ్



పామిడి,నవంబర్ 12(నేటి మినిట్ టు మినిట్): స్థానికంగా ఓ సంఘం పేరుతో వ్యవహరిస్తున్న వ్యక్తిపై పామిడి పట్టణానికి చెందిన పలువురు తీవ్ర ఆరోపణలు చేశారు. కులం పేరును, సంఘం పేరును అడ్డుపెట్టుకుని వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ అధికారులను బెదిరిస్తున్నారని, ఆర్టీఐ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తూ అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు స్థానికులు ప్రెస్‌మీట్ నిర్వహించి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇతర కులాలకు చెందిన వ్యక్తులు నామినేషన్ వేస్తే లక్షల రూపాయలు వస్తాయని ఆశ చూపిస్తూ, ఒక్కొక్కరి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. నామినేషన్ వేస్తే రూ. 4 లక్షలు ఇస్తారా? దెబ్బలు తిన్నా డబ్బులు వస్తాయా? అంటూ బాధితులు ప్రశ్నిస్తున్నారు.ఒక సంఘం పేరు చెప్పుకుంటూ ఒక నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గానికి వెళ్లి అధికారులపై ఒత్తిడి తీసుకొస్తూ, ఆర్టీఐని అడ్డుపెట్టుకుని బెదిరింపులకు పాల్పడుతున్నారని ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న వారు ఆరోపించారు.

అధికారుల నుంచి వస్తువులు, ఇతర ప్రయోజనాలు పొందుతున్నారంటూ విమర్శలు గుప్పించారు. అంతేకాకుండా గతంలో కలెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేశారనే ఆరోపణలు కూడా ఈ సందర్భంగా తెరపైకి తీసుకొచ్చారు. న్యూస్ ఛానళ్లు, పత్రికల పేర్లను ఉపయోగించుకుంటూ లక్షల రూపాయలు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు.

ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.కులం పేరుతో, సంఘం పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ ఇలాంటి వ్యవహారాలకు పాల్పడుతున్న వారిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. గతంలోనూ అనేక తప్పిదాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నప్పటికీ ఇప్పటికీ స్వేచ్ఛగా తిరుగుతూ ఇలాంటి కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై సమగ్ర విచారణ చేపట్టి, నిజానిజాలు నిగ్గుతేల్చి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పామిడి వాసులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



సంఘం మరియు కులం పేరుతో దందా చేస్తూ అధికారులను భయపెడుతున్న ఆ వ్యక్తి పై చర్యలు తీసుకోవాలని ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తాం అంటున్న నాయకులు

సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యం



● కార్యకర్తలు సమిష్టి కృషితో పనిచేయాలి: చమర్తి జగన్మోహన్ రాజు

సిద్ధవటం నవంబర్ 12(నేటి మినిట్ టు మినిట్): రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త అంకితభావంతో సమిష్టి కృషి చేయాలని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన సిద్ధవటంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం స్థానిక సర్పంచ్ ఎన్నికలపై కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల సమయంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని టీడీపీ కార్యకర్తలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన విషయాన్ని కార్యకర్తలు గుర్తు చేసుకోవాలని అన్నారు. రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి పొత్తులో భాగంగా స్థానాలను సర్దుబాటు చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సీట్ల పంపకాల్లో తప్పనిసరిగా పొత్తు ధర్మాన్ని పాటిస్తోందన్నారు. ప్రతి గ్రామంలో పార్టీకి బలమైన నాయకత్వం ఉండాలని, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలకు గ్రామస్థాయి పదవులతో పాటు సర్పంచ్, నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యత, న్యాయం కల్పిస్తామని చమర్తి జగన్మోహన్ రాజు హామీ ఇచ్చారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని పొత్తు ధర్మంలో భాగంగా రాష్ట్ర నాయకత్వం జనసేన పార్టీకి కేటాయించిందని, రాబోయే రోజుల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని టీడీపీ కార్యకర్తలకు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్పంచ్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని నాయకులు సూచించారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు. మండల టీడీపీ అధ్యక్షుడు రాజశేఖర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శనివారపు మోహన్‌రెడ్డి, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ దారపునేని రాజానాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు దారపునేని దశరథనాయుడు, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఆర్గనైజర్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సంజీవరా యుడు, మాజీ మార్కెట్ చైర్మన్ సయ్యద్ జవహర్ భాష, టీడీపీ పార్లమెంట్ మాజీ ఉపాధ్యక్షుడు పుత్త రామచంద్రయ్య తదితర ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

M/S SUNIL PUBLICATIONSPrinting Press (Name & Address)PrinterM/S SUNIL PUBLICATIONS D.NO.: 28-5-782, HOUSING BOARD COLONY, REVENUE WARD NO. 28, ANANTAPUR., ANDHRA PRADESH - 515001.